# సింగిల్ పేజి కథలు

## బాధ్యత

రామారావుగారికి తన గొంతు తనే నులుముకోవాలన్పిస్తోంది. ఏ కొండమీదకైనా ఎక్కి దూకాలన్పిస్తోంది. చేసిన పాపం ప్రాణం పోసుకుని కళ్ళముందు తిరుగుతూ ఉంటే "వెళ్ళి రైలు కింద పడదాము" అనే భావం క్షణ క్షణానికీ పెరిగిపోతోంది. అదిగో ఆ సంగతి తెలిసినప్పటినుంచీ, కానీ ఇది తన మరణంతో సమసిపోయే సమస్య కాదు. తను కూడా లేకుంటే ఇంకా పెద్దదయ్యే కష్టం. 'పోనీ, నాతోపాటు దాన్నీ చంపేస్తే?'

'పాపం..అన్నెం పున్నెం ఎరుగని పిల్ల..తల్లి లేనిదని, నా చేతుల్తో ఎంతో గారాబంగా పెంచాను. అయినా ఒక్కనాడూ చిన్న పొరపాటు కూడా చేసి ఎరుగదు. చక్కగా చదువుకున్నది. సంగీత, సాహిత్యాల్లోనూ ప్రావీణ్యం సాధించింది. అన్నీ తెలిసిన అణుకువ గలది. ఉద్యోగం చేద్దామని కూడా ఉబలాటపడింది. కానీ, నేనో పెద్ద మూర్ఖుణ్ణి కదా..వద్దన్నాను. ఊరుకున్నది. పెళ్ళిరూపంలో ప్రమాదం ముంచుకొచ్చింది.'

ప్రమాదం..ప్రమాదం..ప్రమాదం...

ఆయన మనసు గతాన్ని శోధిస్తూ సాగిపోయింది.

★ ★ ★

రామారావుగారమ్మాయి వందనకు ఆరోజు పెళ్ళి చూపులు. అబ్బాయి తరఫున ఐదుగురు వచ్చారు. రామ్మూర్తిగారు తన ఇద్దరు తమ్ముళ్ళనూ, మరదళ్ళనూ సాయానికి పిలిచారు. వరుడు వినయ్ యమ్.సి.ఎ. చేశాడు. బెంగుళూరులో ఉద్యోగం. మంచి జీతం. అందగాడు. ఐశ్వర్యవంతుడు కూడా. తన రూపంతోనే కాక, వాగ్ధాటితోనూ అందరికీ ఆకర్షించాడు. వందన కూడా ఎందులోనూ తీసిపోలేదు. కాకపోతే ఈమె మితభాషి. అన్నిటికీ చిరునవ్వే సమాధానం. అమ్మాయీ, అబ్బాయీ కూడా ఒకరికొకరు నచ్చారని వాళ్ళ హావ భావాలను బట్టి అందరికీ అర్థమయింది. అంత మంచి సంబంధం కుదరడం వందనే కాదు, రామారావుగారు చాలా అదృష్టవంతులని అనుకున్నారు ఆయన తమ్ముళ్ళూ మరదళ్ళూ. ఎంగేజ్‌మెంట్ డేట్ ఫిక్స్ చేసుకోబోతుండగా ఒక బాంబు పేల్చాడు వినయ్. నా దగ్గర హెచ్.ఐ.వి. నెగటివ్ సర్టిఫికెట్ ఉన్నది. వధువు దగ్గర కూడా ఉంటే, ఇక తనకెలాంటి అభ్యంతరమూ లేదని.."

ఆ మాట వినగానే రామారావుగారికి కోపం నషాళానికి అంటింది. ఆవేశంతో వణికి పోయారు. అగ్గిమీద గుగ్గిలమయ్యారు.

"ఫస్ట్ యూ గెటౌట్" అన్నారు గుమ్మం వైపు వేలు పెట్టి చూపిస్తూ.

"అంత తప్పుమాట తానేమన్నాడో" వినయ్‌కు అర్థం కాలేదు.

జరిగిన అవమానానికి, అతనికీ తట్టుకోలేనంత కోపం వచ్చింది. అయినా, దిగమింగుకుని, రామారావుగారికి వివరించి చెప్పాలని ప్రయత్నించాడు.

"మరొక్క మాట మాట్లాడినా మర్యాద దక్కదు. ముందు బయటికి పొండి" అంటూ గెంటినంత పని చేశారు ఆయన. జరిగిన తతంగానికి వందనతో సహా అందరూ ౖమాన్పడిపోయారు. కొద్దిసేపు ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. మ్యారేజ్ బ్రోకర్‌తో సహా వరుని తరఫు వారందరూ నిష్క్రమించారు. ఆయాసంతో వగర్చుతూ సోఫాలో కూలబడ్డారు రామారావు.

"ఇది మర్యాదస్తుల ఇల్లనుకున్నాడా..లేక సాని కొంప అనుకున్నాడా? ఆ వెధవ అంత మాట అడుగుతాడా? ఇంకొద్ది సేపు ఇక్కడే ఉంటే వాడి ప్రాణం తీసేవాణ్ణి" అంత కోపంగా ఆయన్ని ఎవరూ, ఎప్పుడూ చూడలేదు. ఆయనకి ఏమీ చెప్పలేక, అందరూ మౌనంగా ఉండిపోయారు.

ఆ చిరాకులో ఆయన కొన్నాళ్ళు వందనకు సంబంధాలు చూడటమే మానేశారు. తమ్ముళ్ళు పోరు పెట్టగా కొన్నాళ్ళకు మరొక సంబంధం చూశారు. ఇది అంతకంటే మంచి సంబందం. వీళ్ళు అటువంటి ప్రశ్నలు వెయ్యలేదు. ఉభయుల అంగీకారంతో లగ్నాలు పెట్టుకున్నారు. ఎవరూ ఊహించని రీతిలో తన ఒక్కగానొక్క కూతురి పెళ్ళి అత్యంత వైభవంగా చేశారు రామారావు.

వందన అత్తవారింటికి వెళ్ళి, ముచ్చటగా కొన్నాళ్ళు కాపురం చేసింది. కూతురికి ఘనమైన సంబంధం చేశానని ఆయన మురిసినన్నాళ్ళు పట్టలేదు. ఆమెకు అనేక అనారోగ్యాలు మొదలయ్యాయి. విశ్రాంతి కోసం పుట్టింటికి వచ్చింది. ఆ వేళ హాస్పిటల్‌కు వెళ్తే, లేడీ డాక్టరు అన్ని పరీక్షలతోపాటు హెచ్.ఐ.వి. కూడా చేయించారు.

"పాజిటివ్.."

రిపోర్టు చూడగానే వందన కుప్పకూలిపోయింది.

రామ్మూర్తిగారు నిలువునా నీరైపోయారు. తను ప్రాణప్రదంగా పెంచుకున్న, తన ప్రియాతిప్రియమైన కుమార్తె భయంకరమైన ఎయిడ్స్ పీడితురాలు.

కనీ వినీ ఎరుగని, కలలో కూడా ఊహించని దుర్భర పరిస్థితి దాపురించింది ఆయనకు. సర్వాంగాలూ స్థంభించిపోయాయి. కట్టెలా బిగుసుకుపోయారు. కొద్దిసేపటికి తేరుకున్న ఆయన, వినయ్‌ని అవమానించి పంపిన తన అజ్ఞానం వికృతరూపంలో కళ్ళముందు నాట్యమాడినట్లుగా విరుచుకుపడిపోయారు.

-కోపూరి పుష్పాదేవి (విజయవాడ)

★★★

## నమ్మకం

రాధ గవర్నమెంటాఫీసులో ఉద్యోగం చేసి, రిటైరై రాధమ్మగా మారింది. పిల్లలు ముగ్గురూ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వాళ్లకూ పెళ్ళిళ్లై పిల్లాపాపలతో హాయిగా తలో చోటా ఉన్నారు. రాధమ్మ భర్త కూడా బ్యాంకు ఆఫీసర్‌గా రిటైరయ్యాడు. చూడాలనిపిస్తే ఇద్దరూ వెళ్లి పిల్లల్ని, మనవల్నీ చూసొస్తారు. వాళ్లూ శలవు దొరికినప్పుడల్లా వచ్చి వెడుతూంటారు.

రాధమ్మ ముక్కుసూటిగా పోయే వ్యక్తి. డబ్బులు బాగా వచ్చే సీటైనా ఎవరి దగ్గర నుండీ పైసా తీసుకోలేదు. సర్వీసులో ఉండగా నిజాయితీకి మారుపేరుగా ఉండేది. తనకు రావలసిన డబ్బుల్లో పైసా తేడా వచ్చినా ఊరుకునేది కాదు. దానధర్మాలు బాగానే చేస్తుంది. తన కిష్టమైతే ఎంతైనా ఖర్చుపెడుతుంది. నచ్చనప్పుడు పైసా ఖర్చు చెయ్యడంలో కూడా పదిసార్లు ఆలోచిస్తుంది.

రోజూ ఏ గుడికో, గానసభలకో, పురాణం వినడానికో వెళ్లడం ఆవిడకలవాటు. ఒక రోజు ధ్యానానికెళ్లి వస్తూ దార్లో రెండు రూపాయల పువ్వులు కొంది. పది రూపాయల నోటిచ్చి, చిల్లర ఇమ్మంది. "అమ్మా నా దగ్గర ఏడు రూపాయిలే ఉంది చిల్లర" అంది పూల కొట్టమ్మాయి.

'మరిఎట్లా' అని సందిగ్ధంలో నిలబడ్డ రాధమ్మతో "అమ్మగారూ డబ్బులు రేపివ్వండి" అని పదినోటు తిరిగిచ్చేసింది.

'అయ్యో, నా మీద తనకున్న నమ్మకం, తన మీద నాకు లేకపోయిందే, ఒక్క రూపాయి తక్కువ ఉందని చెప్తే నేను తీసుకోలేదు. పూలమ్మాయి నన్నే రెండు రూపాయలు రేపిమ్మంది. తన మంచితనం ముందు నా పెద్దరికం చిన్నబోయింది" అనుకుని మొట్టమొదటి సారిగా తలదించుకుంది రాధమ్మ.

-సి.రత్నమాంబ (విజయవాడ)

★★★

## పరీక్ష

మూర్స్ ట్యుటోరియల్స్‌లో రాము మెట్రిక్యులేషను చదివి పరీక్షలో తప్పాడు. ప్రిన్సిపాల్ మధు దగ్గరకు వెళ్లి తనకు ఆ ట్యుటోరియల్స్‌లోని టీచర్లు వారి సబ్జక్టులను సరిగ్గా బోధించలేదని అందుచేత తను పరీక్షలో తప్పానని చెప్పాడు. తను చెల్లించిన ఫీజంతా తిరిగి ఇచ్చేయమని మధుని డిమాండ్ చేశాడు. తెలివైన

మధు రాముతో, "సరే రాము. నువ్వు చెప్పింది సబబుగానే వుంది. నువ్వన్నట్లుగా మా ట్యుటోరియల్స్‌లో టీచర్లు నీకు సరిగ్గా బోధించలేదని రుజువయితే నువ్వు మాకు చెల్లించిన ఫీజు తిరిగి ఇచ్చేస్తాం. నువ్వు ఒక గంట తరువాత మళ్లీ ఇక్కడకు వస్తే మా టీచర్లు వాళ్ల సబ్జక్టులలో నిన్ను పరీక్ష చేస్తారు" అని అన్నాడు. రాము బయటకు వెళ్లాడు. వెంటనే మధు టీచర్లందరిని పిలిపించాడు.

"రాము అనే విద్యార్థి మన ట్యుటోరియల్స్‌లో మెట్రిక్యులేషన్ చదివానని, మీరు అతనికి బాగా బోధించని కారణంగా తను పరీక్షలో తప్పానని, అందుచేత అతను మన ట్యుటోరియల్స్‌కు చెల్లించిన ఫీజును తిరిగి ఇచ్చి వేయాలని డిమాండ్ చేశాడు" అని మధు అన్నాడు.

"మేమంతా మా సబ్జక్టులను బాగానే టీచ్ చేశాం సార్. మన ట్యుటోరియల్స్‌లో ఫస్టు క్లాసులు చాలా వచ్చాయి. చదవని రాము తప్ప అందరు పాసయ్యారు" అని తమ తప్పు లేదంటూ టీచర్లంతా అన్నారు.

"మీ లోపం లేదని నాకు తెల్సు. మనకు వచ్చిన రిజల్ట్స్ ఆ సంగతిని రుజువు చేశాయి. కానీ మనం ఇప్పుడు చేయవల్సింది ఒక్కటే. రాముని మీరంతా మీమీ సబ్జక్టులలో పరీక్ష చేసి అతను అన్ని సబ్జక్టులలో పాసయినట్లుగా చూపాలి. మీరడిగే ప్రశ్నలలోనే అతనికి సమాధానాలు వుండాలి. ఒక్క ప్రశ్న కూడా అతనికి కష్టంగా వుండకూడదు. ఈ సంగతి ముఖ్యంగా గుర్తు పెట్టుకోండి" అని మధు సలహా ఇస్తూ వాళ్లకి చెప్పాడు.

"సరే సార్" అని అందరూ తలలూపారు.

ఒక గంట తరువాత మళ్లీరాము మధు దగ్గరికి వచ్చాడు. మొదట తెలుగు టీచరు తన పరీక్ష ప్రారంభించాడు.

"తెలుగు వ్యాకరణంలో నామవాచకమంటే ఒక మనిషి పేరు, స్థలంపేరు, వస్తువు పేరు. నీపేరు చెప్పు, రాము" అని టీచరడిగాడు.

"రాము" అని సమాధానం చెప్పాడు రాము.

"సెభాష్! నువ్వు నామవాచకానికి సరియైన ఉదాహరణ చెప్పావు. నువ్వు తెలుగు వ్యాకరణంలో పాసయ్యావు" అని అన్నాడు. తరువాత సైన్స్ టీచరు రాముని ఒక ప్రశ్న అడిగాడు. "ఆర్కిమెడీస్ సూత్రాన్ని ఎవరు కనిపెట్టారు?"

"ఆర్కిమెడీస్" అని సమాధానం చెప్పాడు రాము.

"రైట్..నువ్వు సైన్సులో పాసయ్యావు" అని సైన్సు టీచరు అన్నాడు. ఆ తరువాత సోషల్ స్టడీస్ టీచరు ఒక ప్రశ్న వేశాడు.

"ఢిల్లీ రాజధానిగా గల మన దేశానికి రాజధాని ఏది?"

"ఢిల్లీ" అని రాము బదులు చెప్పాడు.

"కరెక్ట్. నువ్వు సోషల్ స్టడీస్‌లో పాసయ్యావు" అని అన్నాడు సోషల్ స్టడీస్ టీచరు.

అప్పుడు ఇంగ్లీష్ టీచరడిగాడు.

"వాట్ డు యూ వాంట్, రాము?"

"ఐ వాంట్ మై మనీ" అని సమాధానం చెప్పాడు రాము.

"దటీజ్ ది రైటాన్సర్..యుహావ్ పాస్డ్ ఇంగ్లీష్" అని అన్నాడు ఇంగ్లీష్ టీచరు. చివరికి లెక్కల టీచరు వంతు వచ్చింది. ఆయన మిగిలిన టీచర్లతోను, ప్రిన్సిపాల్ తోను, "నా సబ్జక్టులో కూడా పాసయినప్పుడే రాము మన ట్యుటోరియల్స్‌లో బాగా నేర్చుకున్నట్లు అవుతుంది" అన్నాడు. మిగిలిన టీచర్లు లెక్కల టీచరు మాటల ధోరణికి కొంచెం షాక్ తిన్నారు. తను చెప్పిన సలహాను మరిచిపోయి ఆయన లెక్కల సబ్జక్టులో కష్టమైన ప్రశ్న అడుగుతాడని మధు కంగారుపడుతున్నాడు. లెక్కల టీచరు రాముని సీరియస్‌గా అడిగాడు. "రాము, నీకు ఈ ట్యుటోరియల్స్ నుంచి ఎంత డబ్బు తిరిగి రావాలి?" మధు, మిగిలిన టీచర్లు ఆ ప్రశ్నను విని లెక్కల టీచరు రాముకి అతను కట్టిన ఫీజంతా తిరిగి ఇప్పించేస్తాడేమోనని భయపడిపోతున్నారు. రాము సమాధానం చెప్పాడు. "నెలకు నూటయాభై రూపాయల వంతున ఎనిమిది నెలలకు పన్నెండు వందల రూపాయల ఫీజు, ప్రారంభంలో కట్టిన ఎడ్మిషన్ ఫీజు మూడు వందల రూపాయలు, కలిపి మొత్తం నాకు పదిహేను వందల రూపాయలు తిరిగి వస్తుంది" తనకు డబ్బు తిరిగి వస్తుందనే సంతోషంతో రాము వివరంగా సమాధానం ఇచ్చాడు. అప్పుడు లెక్కల టీచరు "రాము, ఇప్పుడు నేనడిగిన ప్రశ్న లెక్కల సబ్జక్టుకు సంబంధించినది. దానికి నువ్వు కరెక్ట్‌గా లెక్క కట్టి సమాధానం చెప్పావు. నువ్వు నా సబ్జక్ట్‌లో కూడా పాసయ్యావు" అని ముగించాడు. మధు అమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాడు. మిగిలిన టీచర్లు, మధు లెక్కల టీచర్ తెలివితేటలకు ఆయనను తమ మనసులలోనే అభినందించారు. మధు, రాముతో "ఇక్కడ నువ్వు నేర్చుకున్న అయిదు సబ్జక్టులలోను నువ్వు పాసయ్యావు. అందుచేత నీకు మేము నువ్వు చెల్లించిన డబ్బును తిరిగి ఇవ్వవల్సిన అవసరం లేదు" అని చెప్పాడు. పాపం! తెలివి తక్కువ రాము తెల్లమొహం వేసి ఇంటి ముఖం పట్టాడు. అప్పుడు టీచర్లందరు మధుతో "రాము మా క్లాసులకు రెగ్యులర్‌గా హాజరు కాలేదు, కష్టపడి చదవలేదు" అని అన్నారు. మధువాళ్లతో "అందుచేతనే రాముని తగిన ప్రశ్నలడిగి పాసయ్యాడని, మన దగ్గర సబ్జక్టులన్నీ నేర్చుకున్నాడని చెప్పాం" అన్నాడు.

-కూచిభట్ల శ్రీనివాసశాస్త్రి (హైదరాబాద్)

★★★

# వైరాగ్యం

రమ్య రవిలది ఓ అపురూపమైన జంట. వారి పెళ్ళయి రెండేళ్ళు కావొస్తోంది. రమ్యకు ఇప్పుడు తొమ్మిదో నెల. భార్య నెల తప్పిననాటి నుండి ఆమెను మరింత అపురూపంగా చూసుకుంటున్నాడు రవి. రమ్య అత్తమామలు ఆమెని కన్నకూతురిలా చూసుకుంటున్నారు.

ఓరోజు ఆఫీసు పని మూలాన రవి హఠాత్తుగా కేంప్‌కి వెళ్ళాల్సి వచ్చింది. భార్యని ఆ పరిస్థితుల్లో వదల్లేక వదల్లేక బయల్దేరాడు. తను కేంప్ కెళ్ళేముందు ఫేమిలీ డాక్టర్‌కి తన భార్య గురించి ఆందోళన వ్యక్త పరిచాడు. రవి ఆమె సెన్సిటివ్‌నెస్‌ని డాక్టర్‌కి గుర్తు చేశాడు. ఆమె ఈ ప్రసవ వేదన భరించలేదేమోనని అతని భయం. 'రమ్యకు ఏదైనా ప్రమాదం జరిగితే' రవి ఊహించలేకపోయాడు. రమ్య లేనిదే రవి లేడు.

★ ★ ★

వెన్నులో నొప్పితో ఫెళ్ళు మని, చరచినట్టె మెలకువ వొచ్చింది రమ్యకు. కడుపులోని ప్రాణి బయటకు వచ్చే ప్రయత్నమదని అర్థమై నిలువెల్లా వణికిపోయిందామె.

క్షణాల్లో హాస్పటల్లో చేర్చబడింది రమ్య.

అప్పుడన్పించింది రమ్యకు.

భరించలేని బాధ మెలితిప్పుతోందామెను. పళ్ళ బిగువ నదిమి పెట్టింది అంతటి బాధనూ. అప్పుడన్పించింది రమ్యకు.

ఇంత వేదననోర్చి, మృత్యుముఖంలో అడుగిడే క్షణాన, తనాజీవిని ఎలా క్షమిస్తుంది...ఎందుకీ ఆప్యాయతలు, మమకారాలు?

తిరిగి జీవించటం అనేది అసలుందా? ఎంత పిచ్చిదై నవమాసాలు మోసిందీ 'రాక్షసుణ్ణి'.

తీయని మాటలతో, బలహీన క్షణాన తనని వశపర్చుకున్న భర్తది కదూ ఈ నేరం! ఈ వేదనలో వెయ్యోవంతైనా ఆయన అనుభవించగలడా?

భగవాన్! మళ్ళీ బ్రతకటం అనేది జరిగితే తన ఈ వేదనకు కారకులైన వార్ని, వేధిస్తున్న వార్ని కన్నెత్తి కూడా చూడగూడదు'

విల విల లాడింది రమ్య.

★ ★ ★

కేంప్ నుండి వచ్చిన రవికి తియ్యని వార్త అందింది. తన భార్య క్షేమంగా వుందని, తనకోముద్దుల బిడ్డనిచ్చిందని. భార్యాబిడ్డల్ని ఆనందంగా చూసుకున్నాడు.

బోసినవ్వుల బాబును, హృదయానికి హత్తుకుని ముద్దాడి, ఊయలలో వేసింది రమ్య.

ఎంత వేదన పడి సంపాదించుకున్నదీ ముద్దుల మూటను. ఒక్కక్షణం ఆ పసివాణ్ణి చూసి, గర్వంతో లయ తప్పిందామె హృదయం.

ఇంతటి తీయని వరాన్ని ప్రసాదించిన తన 'పతిదేవుని' కౌగిలిలో ఒదిగిపోతూ-అనుకుంది రమ్య. "భగవాన్! మరో జన్మంటూ వుంటే-ఇటువంటి బిడ్డను, భర్తను ప్రసాదించు".

-బి.పాండురంగారెడ్డి (కరీంనగర్)